ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -155 | పేజీలు - 8 | వెల ₹03/- | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026

పటిష్ఠమైన రక్షణ అవసరం

మైనర్ల సోషల్ మీడియా వాడకం...

పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు

మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు తెరవకుండా నిషేధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్

కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఒప్పందాలు చేసుకోలేరని పిటిషనర్ వాదన

పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ

భారత్‌లో కొన్ని పటిష్ఠమైన రక్షణ చర్యలు అవసరమని చీఫ్ జస్టిస్ వ్యాఖ్య



న్యూఢిల్లీ సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్): సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. **మిగతా 2లో...**

రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి

: అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

రివ్యూలతో కాలయాపన వద్దు, ఫలితాలు చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టీకరణ

ప్రో-యాక్టివ్‌గా పనిచేస్తూ, అభివృద్ధిలో జిల్లాలు, శాఖలు పోటీ పడాలని దిశానిర్దేశం

'సీఈఓ' గుర్తింపు కన్నా 'వాటర్ మ్యాన్' అని పిలిపించుకోవడమే తనకు సంతృప్తి అన్న సీఎం

నకిలీ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, వాస్తవ నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచన

'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'తో స్వర్ణాంధ్ర సాధన సాధ్యమన్న చంద్రబాబు

అమరావతి సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్): "గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. **మిగతా 2లో...**





బ్రిక్స్ వైపే అందరి చూపు

సదస్సుకు సిద్ధమైన ఢిల్లీ

నేడు రష్యా, ఇరాన్ అధ్యక్షుల రాక ,మోడీతో ప్రత్యేక భేటీ



న్యూఢిల్లీ సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్): భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ సమావేశాల వేదికకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధులూ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రపంచ ఆర్థిక వృద్ధిని మరింత సమ్మిళితంగా మార్చేందుకు అవసరమైన సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో 18వ బ్రిక్స్ లీడర్స్ సమ్మిట్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ , ఇరాన్ అధ్యక్షుడు**మిగతా 2లో...**

మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరం

ఏపీ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

ఈడీతో పాటు రాష్ట్ర విచారణ బృందాల దర్యాప్తు సమాంతరంగా సాగడంలో తప్పు లేదని వ్యాఖ్య

బెయిల్ పిటిషన్ ను తిరస్కరించిన ధర్మాసనం



2లో.

బొత్స భావోద్వేగం

మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడంతో బొత్స సత్యనారాయణ భావోద్వేగం

చీపురుపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కంటతడి పెట్టిన బొత్స

వ్యక్తులు వస్తుంటారు పోతుంటారు, పార్టీనే శాశ్వతమంటూ కేడర్‌కు ధైర్యం



2లో.

చంద్రబాబు 'వాటర్ మ్యాన్'

సాగునీటి రంగంలో సీఎం కృషికి దేశం గుర్తింపు: ఆర్థిక మంత్రి పయ్యావుల

ముఖ్యమంత్రిని 'వాటర్ మ్యాన్'గా కీర్తించిన 'ఎకనమిక్ టైమ్స్'

కలెక్టర్ల సదస్సులో ఈ విషయాన్ని ప్రస్తావించిన మంత్రి పయ్యావుల

సాగునీటి రంగంలో కృషికి సీఎం చంద్రబాబుకు స్టాండింగ్ ఓవేషన్

డీఎస్సీపై వాస్తవాలు వివరించిన మహిళా అధికారులను అభినందించిన సీఎం



2లో.

చేతనైతే ఆపండి!

ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహిస్తా..: జగన్‌కు నారా లోకేశ్ సవాల్



మెగా డీఎస్సీపై జగన్ ఆరోపణలు

వీడియోతో కౌంటర్ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్

ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి 3,000 పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడి

ఐదేళ్లలో మొత్తం 30,000 టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసే బాధ్యత తమదేనని స్పష్టీకరణ

ఉపాధ్యాయులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

త్వరలోనే తదుపరి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడి

అమరావతి సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్): మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి తీరుతామని, చేతనైతే ఆపాలని జగన్‌కు సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో సుమారు 30 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడమే లక్ష్యమని **మిగతా 2లో...**

కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు

కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్

అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు

భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు



2లో.

స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు?

మెగా డిఎస్సీ కాదు..దగా డిఎస్సీ

తప్పుతున్న కొద్దీ బయటపడుతున్న అక్రమాలు

ఇప్పటి వరకు పెదవి విప్పని చంద్రబాబు, లోకేష్

బోగస్ సర్టిఫికెట్స్ పోస్ట్ లు అమ్ముకున్న ఘనులు

తాము ప్రశ్నిస్తుంటే బుల్డోజ్ చేస్తున్నారు

మరోసారి డీఎస్సీపై జగన్ విమర్శలు

అమరావతి సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్): డీఎస్సీకిసంబంధించినప్రశ్నలకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నుంచి సమాధానం రావడం లేదని వైసీపీ అధినేత,మాజీ సీఎం జగన్అన్నారు.రోజులుగా మౌనం పాటిస్తుండటాన్ని చూస్తే డీఎస్సీలో అక్రమాలు నిజమేనని రుజువవుతోందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసు స్టడీలను చూస్తే విస్తుపోయే పరిస్థితి ఉందన్నారు. తాడేపల్లిలో గురువారం మీడియాతో మాట్లాడిన జగన్.. డీఎస్సీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటాలో 372 పోస్టులను పరీక్ష లేకుండానే భర్తీ చేశారని,**మిగతా 2లో...**



రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి

మొదటిపేజీ తరువాయి

రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.

"గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు.

ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ. 1.40 లక్షల కోట్ల సంక్షేమానికి, రూ. 1.50 లక్షల కోట్ల అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. జిల్లాలో 'గ్రోత్ ఇంజన్లను' గుర్తించి సంపద సృష్టించాలని సూచించారు. "టెక్నాలజీని అందిపుచ్చుకుని 'డీప్ టెక్ గవర్నెన్స్' ద్వారా నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి. కొందరు పనిగట్టుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వాటిని వెంటనే గుర్తించి, వాస్తవాలతో తిప్పికొట్టాలి. డీఎస్సీ-2025 విషయంలో ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచారు. వారిని అభినందిస్తున్నాను" అని సీఎం అన్నారు.గత ప్రభుత్వ హయాంలోని 'జే బ్రాండ్' మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని, తాము కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, నీటి భద్రత ఒక సవాలుగా మారిందని, అయినా తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ పడబోమని హామీ ఇచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు.

2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్తామని ఆయన అధికారులలో స్ఫూర్తి నింపారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు 'వాటర్ మ్యాన్'

సాగునీటి రంగంలో సీఎం కృషికి దేశం గుర్తింపు

: ఆర్థిక మంత్రి పయ్యావుల

ముఖ్యమంత్రిని 'వాటర్ మ్యాన్'గా కీర్తించిన 'ఎకనమిక్ టైమ్స్'

అమరావతి సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశంసల వర్షం కురిపించారు. సాగునీటి రంగంలో చంద్రబాబు చేస్తున్న కృషిని వివరిస్తూ, ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ఎకనమిక్ టైమ్స్' ఆయన్ను 'వాటర్ మ్యాన్'గా కీర్తిస్తూ కథనం రాసిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు అభినందన సూచకంగా సదస్సులో ఉన్నవారంతా నిలబడి చప్పట్లతో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ.. "నీటి వనరుల రంగంలో మనం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల



ద్వారా నీటి విడుదల గురించి ఇతర రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు" అని అన్నారు.

మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారని, దాని ఫలితంగానే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగామని వివరించారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించినా, దాని ద్వారా ఇప్పటివరకు 500 టీఎంసీల నీటిని తరలించగలిగామని, ప్రకాశం బ్యారేజీని 200 సార్లు నింపి డెల్టాకు నీరందించామని పయ్యావుల తెలిపారు. రైతుల కోసం సీఎం పడుతున్న తపనను దేశం గుర్తించిందని, ఆయన సాధించిన విజయమే రాష్ట్ర అభివృద్ధి అని కొనియాడారు.

మహిళా అధికారులకు సీఎం అభినందన

ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరు మహిళా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలు వివరించారంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ ఎండీ భరణిలకు కితాబిచ్చారు.

"మనం సమర్థవంతంగా డీఎస్సీని నిర్వహించాం. దానిపై విమర్శలు వస్తే ప్రజలకు వాస్తవాలు వివరించాలి. ఆ బాధ్యతను ఈ మహిళా అధికారులు చక్కగా నిర్వర్తించారు" అని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

బ్రిక్స్ వైపే అందరి చూపు

మొదటిపేజీ తరువాయి

మసూద్ పెజెష్కియాన్ శుక్రవారమే న్యూఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. వీరిద్దరూ ప్రధానమంత్రి మోడీతో భేటీ కానున్నారు.

బ్రిక్స్ అనేది గ్లోబల్ సౌత్ దేశాల మధ్య రాజకీయ, దౌత్య, ఆర్థిక సహకారం కోసం ఏర్పడిన అంతర్జాతీయ సమన్వయ వేదిక. దీనికి ప్రత్యేక రాజ్యాంగ ఒప్పందం, సొంత బడ్జెట్ లేదా శాశ్వత సెక్రటేరియట్ లేవు. బ్రిక్స్ సహకారం ప్రధానంగా మూడు విభాగాలుడరాజకీయ, భద్రతా సహకారం, ఆర్థిక రంగ సహకారం, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాల చుట్టూ కొనసాగుతుంది. ప్రస్తుతం బ్రిక్స్‌లో 11 పూర్తి సభ్య దేశాలు ఉన్నాయి.

నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్షత బాధ్యతలు చేపట్టనున్న భారత్

2026 జనవరి 1 నుంచి భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టింది. అయితే భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లోనూ భారత్ ఈ బాధ్యతలను నిర్వహించింది. అంతేకాకుండా 2026వ సంవత్సరం బ్రిక్స్ ఏర్పాటై 20 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది

2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో (పార్ట్నర్ కంట్రీ కేటగిరీ ఏర్పాటు

2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో పార్ట్నర్ కంట్రీ కేటగిరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విభాగంలో బెలారస్, బొలీవియా, క్యూబా, కజకిస్తాన్, మలేషియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్, వియత్నాం ఉన్నాయి. భాగస్వామ్య దేశాలను సాధారణంగా నేతల సదస్సుకు ఆహ్వానిస్తారు. సభ్య దేశాల ఏకాభిప్రాయం ఉన్న సందర్భాల్లో ఇతర బ్రిక్స్ సమావేశాల్లోనూ వీరు పాల్గొనే అవకాశం ఉంటుంది.

విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భారత ప్రభుత్వం, భారత భద్రతా బలగాలు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సదస్సు సమయంలో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఢిల్లీ విమానాశ్రయ నిర్వాహక సంస్థ పలు కఠినమైన చర్యలను అమలు చేస్తోంది. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 500 సీసీటీవీ కెమెరాల సహాయంతో, భద్రతా ఏర్పాట్లను సీసీటీవీ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తుంది. ఈ కంట్రోల్ రూమ్ పరిధిలో న్యూఢిల్లీ జిల్లాలోని కీలకమైన రహదారులలో సగం భాగం, అలాగే విదేశీ అతిథులు బస చేయనున్న ఆబ్రే హోటల్ , తాజ్ మాన్ సింగ్ హోటల్ వంటి ప్రాంతాలు ఉంటాయి.అదే విధంగా సమగ్ర భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్జీ, ఇతర ఏజెన్సీలకు చెందిన సుమారు 7,000 మంది సిబ్బందిని మోహరించారు. అలాగే వివిధ ప్రాంతాలలో ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్జీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎస్పీజీ సిబ్బందితో కూడిన బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

బ్రిక్స్ సదస్సు ప్రధాన ఎజెండా

గ్లోబల్ సౌత్: అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను, ప్రాతినిధ్యాన్ని బలంగా వినిపించడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించనుంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ సేవల రంగంలో భారత ప్రభుత్వం సాధించిన విజయాలను, జ్ఞానాన్ని ఇతర బ్రిక్స్ దేశాలతో పంచుకోవడం. వాతావరణ మార్పు లు, ఇంధన పరివర్తన: పునరుత్పాదక శక్తి, ఇంధన భద్రత, స్థిరమైన సాంకేతికతలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం. మల్టీలేటరల్ సంస్థల సంస్కరణలు: ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్ వంటి ప్రపంచ ఆర్థిక, పాలనా సంస్థల్లో వర్ధమాన దేశాలకు సరైన ప్రాతినిధ్యం దక్కేలా సంస్కరణలు తీసుకురావడంపై చర్చలు.

చేతనైతే ఆపండి!

మొదటిపేజీ తరువాయి

ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో లోకేశ్ ఓ వీడియో విడుదల చేశారు. "ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు... ఈ రోజు మాజీ ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీపై మళ్లీ ఆరోపణలు చేస్తున్నారు. నేను సూటిగా ప్రశ్నిస్తున్నా... డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా మీకు తెలుసా? మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లు మీరు భర్తీ చేసిన టీచర్ పోస్టులు సున్నా. అదే, మా ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే పెట్టారు. అందుకే మా ప్రజాప్రభుత్వం దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది.

డీఎస్సీపై మీరు అనేక పర్యాయాలు కోర్టుకు వెళ్లారు. మొన్న మీ ఎమ్మెల్సీ పిల్ వేసి సీబీఐ ఎంక్వైరీ కోరితే, కోర్టు తిరస్కరించింది. డీఎస్సీ ఆపాలని మీరు 300 కేసులు వేసినా, కోర్టు ఎక్కడా మమ్మల్ని తప్పుబట్టలేదు. మా విద్యాశాఖ అధికారులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, మీరు ఆరోపిస్తున్న ప్రతి అంశానికి అద్భుతంగా సమాధానం చెప్పారు. అయినాగానీ మీరు డీఎస్సీపై విషం కక్కడం చాలా బాధాకరం.

ఈ మధ్య నేను చూస్తున్నాను.. మీ దొంగ పేపర్ విలేకరులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, అక్కడున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.. కొన్నిచోట్ల దాడులు కూడా చేస్తున్నారు. అలాంటివాళ్లను వదిలిపెట్టం, వాళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. ఉపాధ్యాయుల జోలికి ఎవరైనా వెళితే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేస్తున్నాను.

ఈ రోజు మీరు కుంభకోణాల గురించి మాట్లాడుతున్నారు. సరిగ్గా మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్ మెంట్ పథకంలో ఏదో కుంభకోణం జరిగిందని మా నాయకుడు చంద్రబాబును అర్ధరాత్రి అరెస్ట్ చేసి 53 రోజులు మీరు జైల్లో బంధించారు. ఈ మూడేళ్లలో న్యాయ ప్రక్రియ పూర్తయి, మా నాయకుడికి క్లీన్ చిట్ వచ్చింది. రెగ్యులేటరీ సంస్థలు కూడా చాలా స్పష్టంగా, ఎక్కడా అవినీతి జరగలేదని చెప్పాయి. మాకు గానీ, మా కుటుంబానికి గానీ, మా పార్టీకి గానీ ఎలాంటి అవినీతి సొమ్ము రాలేదని వాళ్లు తేల్చి చెప్పారు.

జగన్ గారూ ఒకటే చెబుతున్నాను... యువగళం పాదయాత్రలో నేను నిరుద్యోగ యువతను కలిశాను. వాళ్ల సమస్యలను తెలుసుకున్నాను. అందుకే పట్టుదలతో, క్రమశిక్షణతో ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించదలిచాను. ప్రతి సంవత్సరం 3 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. ఈ ఐదేళ్ల ప్రజా ప్రభుత్వంలో దాదాపు 30 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత తీసుకుంటాం. నేను ఒకటే చెబుతున్నాను... చేతనైతే నన్ను ఆపండి చూద్దాం. నేను వదిలిపెట్టను... అనుకున్నది సాధిస్తా.. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి తీరుతాను, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం.

మా ప్రజాప్రభుత్వం తదుపరి డీఎస్సీ నోటిఫికేషన్ ను త్వరలో విడుదల చేయబోతోంది. యువత అందరికీ ఒకటే చెబుతున్నా... బాగా ప్రిపేర్ అవండి, అద్భుతంగా రాయండి, మంచి టీచర్లు అవండి, అందరం కలసికట్టుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుదాం" అంటూ లోకేశ్ తన వీడియోలో పేర్కొన్నారు.

మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరం

ఏపీ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

అమరావతి సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సర్వోన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం ఎదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు దాఖలు చేసిన పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ సందర్భంగా కేసు తీవ్రతను ప్రస్తావించిన సీజేఐ... ఇది తీవ్రమైన ఆర్థిక నేరమని వ్యాఖ్యానించారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఆర్థిక అక్రమాల కేసుతో పాటు రాష్ట్ర పోలీసుల ప్రత్యేక విచారణ బృందాల (సిట్, సీఐడీ) దర్యాప్తు ఒకే సమయంలో సమాంతరంగా సాగడంలో తప్పులేదని కోర్టు తేల్చిచెప్పింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని న్యాయవాదులు తెలుపగా... ఈడీ కస్టడీ పూర్తయిన తక్షణమే సిట్ కస్టడీకి అప్పగించేలా ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది.ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం... సిట్ విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం నిందితులు సంబంధిత కింది కోర్టులోనే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కేసుకు సంబంధించిన అంశాలు, మెరిట్స్ ఆధారంగా మాత్రమే ఆ బెయిల్ దరఖాస్తును కింది కోర్టు పరిశీలిస్తుందని స్పష్టం చేసింది.

స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు?

మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా జూడో పోటీలు జరగకపోయినా జరిగినట్లు చూపించి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించారని ఆరోపించారు. సంబంధిత జూడో అసోసియేషన్ ప్రతినిధులే పోటీలు జరగలేదని చెబుతున్నారని, అలాంటప్పుడు సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థను ఇందుకు ఉపయోగించారని విమర్శించారు. విశాఖపట్నంలో ఓకుటుంబంతో మాట్లాడుకుని ఉద్యోగాలు ఇచ్చారంటూ జగన్ మరోఆరోపణ చేశారు. ఏయే ప్రాంతాల్లో ఈవెంట్లు జరిగినట్లు రికార్డులు సృష్టించారో గుర్తించి, అందుకు అనుగుణంగా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేశారని అన్నారు. జూడో సర్టిఫికెట్లు ఇచ్చింది ఆ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న టీడీపీ ఎంపీ భరత్ అని ఆరోపించారు.ఫస్ట్ ర్యాంకర్ నవీన్కు ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదని, మెరిట్‌లిస్ట్లో పేరు ఎందుకు లేదని జగన్ ప్రశ్నించారు. అతని డీఎస్సీ లాగిన్ఎందుకు బ్లాక్ చేశారని, వెరిఫికేషనక్కు ఎందుకు పిలవలేదని నిలదీశారు.ప్రశ్నాపత్రం తయారీ, పర్యవేక్షణ ఒకే వ్యక్తి చేతిలో పెట్టడంపై కూడాప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ తమ ప్రశ్నలకు సమాధానంచెప్పకుండా తప్పించుకుంటున్నారని ఆరోపిస్తూ.. ఇది 'మెగా డీఎస్సీ' కాదు.. 'దగా డీఎస్సీ' అని జగన్ వ్యాఖ్యానించారు.

కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

హైదరాబాద్ సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు.

ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బొత్స భావోద్వేగం

చీపురుపల్లి సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):

వైసీపీ సీనియర్ నేత, ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన మేనల్లుడు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) టీడీపీలో చేరడంపై స్పందిస్తూ ఆయన కంటతడి పెట్టారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఈ ఉద్విగ్నభరిత వాతావరణం చోటుచేసుకుంది.

చిన్న శ్రీనుతో తనకున్న అనుబంధాన్ని, కార్యకర్తలతో అతనికి ఉన్న సంబంధాలను గుర్తుచేసుకుంటూ బొత్స ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. అనంతరం తేరుకున్న ఆయన, కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు. "రాజకీయాల్లో వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు. కానీ పార్టీ శాశ్వతం. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కొందరు పార్టీలు మారుతుంటారు. ఎవరూ అధైర్యపడొద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి ఆశయాల సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, తాను, ఇతర సీనియర్ నేతలు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.రాష్ట్రస్థాయి బాధ్యతల్లో తాను బిజీగా ఉండటంతో జిల్లా, నియోజకవర్గ బాధ్యతలను పూర్తిగా చిన్న శ్రీనుకే అప్పగించానని బొత్స గుర్తుచేశారు. అయితే, కనీసం కార్యకర్తలకు కూడా సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా పార్టీ మారడం అందరినీ షాక్‌కు గురిచేసిందని పలువురు నేతలు అన్నారు.

పటిష్ఠమైన రక్షణ అవసరం


మొదటిపేజీ తరువాయి

జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా వాదనలు వినిపిస్తూ, అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, "భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణ కోసం పటిష్ఠమైన 'ఫైర్‌వాల్స్' ఉండాలని అభిప్రాయపడ్డారు.మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతంగా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

పాస్టర్ల సేవా దృక్పథం ఆదర్శనీయం

అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు



అనంతపురం ప్రతినిధి, సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):
పాస్టర్ల సేవా దృక్పథం ఆదర్శనీయమని అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా అనంతపురం డిస్ట్రిక్ట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 75వ సర్వసభ్య సమావేశం గురువారం అనంతపురంలోని యేసు కృపా మందిరంలో భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని పలువురు పాస్టర్లు, సేవకులు, సంఘ ప్రతినిధులు హాజరయ్యారు.

భయభక్తులు ద్వారా మార్పు సాధ్యమవుతుంది

ఈ సందర్భంగా పాస్టర్ విజయ్ సింహ ప్రార్థనతో సమావేశం ప్రారంభం కాగా, అమృత ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కర్నూలుకు చెందిన సిస్టర్ సుగుణ కుమారి ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. దేవుని వాక్యానికి విధేయతతో జీవించిన వారికి ఆధ్యాత్మికంగా విజయాలు లభిస్తాయని సుగుణ కుమారి బోధించారు. విశ్వాసం, విధేయత, దేవునిపై భయభక్తులు కలిగి జీవించడం ద్వారా జీవితంలో మార్పు సాధ్య మవుతుందని తెలిపారు. దానియేలు, దావీదు, స్తెఫను, పేతురు వంటి వారి జీవితాల్లో పరిశుద్ధాత్మ శక్తి వారికి విజయాన్ని అందించిందని వివరించారు. ప్రస్తుత సమాజంలో జీవిస్తున్న ప్రతి ఒక్కరూ దేవునిపై భయభక్తులు కలిగి, ఆయన బోధనలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బలపడేందుకు నిరంతరం ప్రార్థన అవసరం

ముఖ్య ప్రసంగీకురాలు సిస్టర్ ఎస్తేర్ రాణి మాట్లాడుతూ పరిశుద్ధాత్మ సత్యంలోకి నడిపిస్తాడని, విశ్వాసులు పరిశుద్ధాత్మ అభిషేకం కోసం ప్రార్థించాలని సూచించారు. దేవుని సత్యాన్ని గ్రహించేందుకు, ఆధ్యాత్మికంగా బలపడేందుకు నిరంతరం ప్రార్థన, విశ్వాసం, విధేయత అవసరమని తెలిపారు. దేవుని చిత్తాన్ని అర్థం చేసుకుని సమాజానికి సేవ చేయడమే క్రైస్తవ విశ్వాసం యొక్క ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాస్టర్ పి. మార్క్, కార్యదర్శి పాస్టర్ జి.ఆర్. ఆనంద్, కోశాధికారి పాస్టర్ కె. జీవన్ బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాస్టర్ జాషువా జహంగీర్, పాస్టర్ శాంత వర్ధన్, పాస్టర్ విజయ్ సింహ, గౌరవ సలహాదారులు పాస్టర్ శ్యాంసన్ నాయక్, పాస్టర్ గిద్యోను, పాస్టర్ వై.పి. బాబు, శ్రీమతి సరళా చంద్రశేఖర్, పాస్టర్ అనిల్ జాషువా తదితరులు పాల్గొన్నారు.



విద్యాభ్యాసానికి ఆర్థిక సహకారం అందజేత

సేవా కార్యక్రమాల్లో భాగంగా పెనుకొండకు చెందిన పాస్టర్ సుధాకర్ కుమార్తె విద్యాభ్యాసానికి అవసరమైన ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం అసోసియేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటునందించడం, అవసరంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సమాజ సేవలో భాగమని పేర్కొన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన గౌరవ అతిథులను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలు, మూమెంటోలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పాస్టర్ శ్యాంసన్ నాయక్, పాస్టర్ వై.పి. బాబు, పాస్టర్ గిద్యోను ప్రార్థనలు నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రెవ. డాక్టర్ బండెల రాజు ప్రార్థన చేయగా, అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆశీర్వాద ప్రార్థన నిర్వహించారు. అనంతరం ప్రేమ విందుతో 75వ సర్వసభ్య సమావేశం ముగిసింది.



గంజాయి విక్రయ ముఠా పట్టివేత

1.5 కిలోల గంజాయి, రెండు బైకులు స్వాధీనం -మైనర్ సహా నలుగురు నిందితులు అరెస్ట్

అనంతపురం క్రైమ్, సెప్టెంబరు 10,(రిపబ్లిక్ న్యూస్):
గంజాయి విక్రయ ముఠాను ఆత్మకూరు పోలీసులు పట్టుకున్నారు.ఈ సందర్భంగా అనంతపురం నగరంలో పోలీసుల నిఘా పెరగడంతో రూటు మార్చిన గంజాయి ముఠా సభ్యులు చివరకు పోలీసులకు చిక్కారు. కళ్యాణదుర్గంఅనంతపురం జాతీయ రహదారి (ఎన్ హెచ్ 544డిడి) సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి విక్రయించేందుకు రడీగా ఉన్న 1,500 గ్రాముల గంజాయి, రవాణాకు ఉపయోగించిన పల్సర్, యమహా ఆర్15 స్పోర్ట్స్ బైకులు, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్లో పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు.

పోలీసుల వలయంలో గంజాయి నిందితులు

ఈ సందర్భంగా రూరల్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎం. చంద్రశేఖర్‌మాట్లాడరు.జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఇటుకలపల్లి సీఐ జె. హేమంత్‌కుమార్, ఆత్మకూరు ఎస్ఐ జి. లక్ష్మణరావు సిబ్బందితో కలిసి పక్కా సమాచారంతో దాడి నిర్వహించారు. పోలీసులు చుట్టుముట్టడంతో గంజాయి విక్రయిస్తున్న నిందితులు పట్టుబడ్డారు.అరెస్టయిన వారిలో కర్ణాటకలోని బళ్లారి పట్టణం శ్రీరాంపురం కాలనీకి చెందిన కాకిమాని రాజు (29), అనంతపురంలోని ముసలమ్మ కట్టకు చెందిన నల్లబోతుల సుంకన్న (25), బిందెల కాలనీ మొదటి రోడ్డుకు చెందిన ఎడవాల మహేష్ అలియాస్ గుణ (37)తో పాటు చట్టపరిధిలోని ఓ బాలుడు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.



గ్రామీణ ప్రాంతాల కేంద్రాలుగా గంజాయి విక్రయం

నిందితుల్లో మహేష్‌పై గతంలో రెండు హత్య కేసులు నమోదై ఉన్నట్లు పోలీసు రికార్డుల్లో ఉన్నట్లు వెల్లడించారు. అనంతపురం నగరంలో మత్తు పదార్థాలపై తనిఖీలు, నిఘా ముమ్మరం కావడంతో నిందితులు తమ కార్యకలాపాలకు రూటు మార్చినట్లు తెలిపారు. బళ్లారికి చెందిన రాజుతో కలిసి మిగిలిన నిందితులు ఆత్మకూరు, కళ్యాణదుర్గం పరిసర గ్రామీణ ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని గంజాయి విక్రయిస్తూ సులభంగా డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు విక్రయ ముఠాను పోలీసులు అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు.జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగానికి పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఏ. వి.సుబ్బారెడ్డి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 10 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏ. వి. సుబ్బారెడ్డి
తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో NRI తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ గురు రాజా ప్రమాణ స్వీకారంలో పాల్గొని అనంతరం తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యా , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉరవకొండ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ముగ్గురి మృతి



ఉరవకొండ క్రైమ్, సెప్టెంబరు 10,(రిపబ్లిక్ న్యూస్):మండల శివారులోని మైక్రో స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతులు వజ్రకరూరు ప్రాంతానికి చెందిన కనేకల్ జైనుల్లా, మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీగా గుర్తించారు.స్థానికుల సమాచారం మేరకు కోర్టు పనుల నిమిత్తం ముగ్గురు ఉరవకొండకు వచ్చారని, పనులు ముగించుకుని బైక్‌పై తిరిగి వజ్రకరూరు వైపు వెళుండగా మైక్రో స్టేషన్ సమీపంలో ప్రమాదం జరిగిందన్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో అక్కడ అయితే అక్కడే మృతి చెందారన్నారు.రహదారిపై జరిగిన ఈ ఘటనతో కొద్దిసేపు భయానక వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మైక్రో స్టేషన్ పరిసరాల్లో, ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పరిశీలించనున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకున్నారు తమ వారిని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టనున్నారు.

పేరుకుపోయిన చెత్త ప్రజల ఆరోగ్యానికి చింత.

శివ ప్రసాద్.



రైల్వే కోడూరు సెప్టెంబర్ 10 రిపబ్లిక్ న్యూస్.
గ్రామాలలో ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే చెత్తను వీధులలో పడవేయకుండా ప్రభుత్వం వారిచ్చిన చెత్తబుట్టలో మాత్రమే చెత్త వేయాలని పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ అన్నారు, మండల కేంద్రం ఓబులవారిపల్లె పంచాయతీలో ని అన్ని వీధులలో చెత్తను తన సిబ్బందితో శుభ్రం చేస్తున్న సందర్భంగా శివప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ వీధులలో చెత్త పేరుకు పోతే ప్రజల ఆరోగ్యానికి చింతగా ఉంటుందని ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి శ్రీరామ రక్షఅని అందుకే ఎప్పటికప్పుడు గ్రామాల వీధులలోనే చెత్తను శుభ్రం చేసి వీధులను పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని ఇది ఎండిఓ ఎంవిఎన్ రాజేంద్ర ఆదేశాల మేరకు, డిప్యూటీ ఎండిఓ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేయడం జరుగుతుందని అన్నారు, ఎండిఓ, డిప్యూటీ ఎండిఓ లు గ్రామాలలో వీధి దీపాలు సమస్యగా ఉన్న ప్రాంతాలలో పర్యటించి సత్వరమే వాటిని పరిష్కరించాలని అలాగే త్రాగునీటి సమస్య గ్రామాలలో ఎక్కడ ఉన్న తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వరమే కృషి చేసి వాటిని అభివృద్ధి పరచాలని ఆదేశించారని శివప్రసాద్ అన్నారు, గ్రామాలలో వీధి దీపాలు, త్రాగునీరు సమస్యలపై ఫిర్యాదులు రాకుండా అవసరమైన ముందస్తుగా గ్రామాల్లో పర్యటించి సమస్యలు ఎక్కడ ఉన్నా మరమ్మతులు చేపట్టాలన్నారు, ఏ కాకుండా గ్రామాలలో చేతిపంపులను గుర్తించి మరమ్మత్తులు చేయించాలని ఎండిఓ, డిప్యూటీ ఎం డి ఓ తెలియజేశారన్నారు.

రాబరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశాం

యస్ ఐ .రామిరెడ్డి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 10 క్రైమ్ రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ తాలూకా ఉయ్యాలవాడ పోలీసు స్టేషన్ SI రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాకరవాడ గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ మరియు వెంకట రవి అనే ఇద్దరు యువకులు బుధవారం రోజున సాయంత్రం కాకరవాడ గ్రామ పొలిమేరలో దూదేకుల జమాల్ అనే కాంట్రాక్టర్ ను కొట్టి, బెదిరించి దౌర్జన్యంగా అతని జేబులో ఉన్న 5000-/ వేల రూపాయలను బలవంతంగా లాక్కొని పారిపోయినారు. దీని మీదట ఉయ్యాలవాడ పోలీసు వారు కేసు నమోదు చేసినారు. దర్యాప్తులో భాగంగా గురువారం రోజు ఉదయం 11-00 గంటల ప్రాంతంలో ఉయ్యాలవాడ లోని కరెంట్ ఆఫీస్ దగ్గర ఇద్దరు యువకులను పట్టుకొని విచారించగా నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఒక మోటార్ బైకు, 5000/ వేల రూపాయలు నగదు మరియు రెండు స్టీల్ మోటార్ సైకిల్ స్టంప్స్ ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించారు మండల పరిధిలో ఎవరైనా దౌర్జన్యానికి పాల్పడిన లేదా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన యెడల వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని ఉయ్యాలవాడ ఎస్సై రామిరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి .



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 10 రిపబ్లిక్ న్యూస్
చాగలమర్రి పట్టణంలో ప్రమాదవశాత్తు కిందపడి కాలు ఫ్యాక్చర్ అయిన జిగ్గిగారి కొలిమి లాజం గారిని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలనిఆకాంక్షించారు. అదేవిధంగా చాగలమర్రి పట్టణానికి చెందిన దూదేకుల సమద్ మృతి చెందడంతో, వారి కుటుంబ సభ్యులను భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని, ఎలాంటి ఆపద వచ్చినా తనను సంప్రదించవచ్చని భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లోభాగస్వాములుగా ఉంటూ, అవసరమైన సమయంలో వారికి అండగా నిలవడమే భూమా కుటుంబం లక్ష్యమని ఆయన తెలిపారు.



స్థానిక ఎన్నికల పోలింగ్ స్టేషన్ల వివరాలను వెల్లడించిన మున్సిపల్ కమిషనర్ కిషోర్

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 10 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోవు స్థానిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లను మున్సిపల్, తహసీల్దార్, ఎం. పి. డి. ఓ. మొత్తం 11 ప్రభుత్వకార్యాలయాలలోని నోటీసు బోర్డుల యందు ఈరోజు ప్రదర్శించడం జరిగినదని సదరు పోలింగ్ స్టేషన్లో పై ఏవైనా అభ్యంతరాలు ఉన్న ఎడల 3 రోజుల లోపు లిఖితపూర్వకంగా ఆళ్లగడ్డ పురపాలక సంఘం కార్యాలయము నందు తెలియజేయలని పోలింగ్ స్టేషన్ల వివరాలను పట్టికలో తెలియపరచామని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/67888

కర్నూలులో 44వ ఈఎన్‌టీ రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభం

11, 12, 13 తేదీల్లో సదస్సు, వర్క్‌షాప్‌లు.. రాష్ట్రం నలుమూలల నుంచి వైద్య నిపుణుల హాజరు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 10)

కర్నూలు మెడికల్ కాలేజీలో 44వ ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) రాష్ట్రస్థాయి సదస్సు, వర్క్‌షాప్‌లు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరిగే కార్యక్రమాలకు సంబంధించి నిర్వాహకులు కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్‌ను కలిసి బ్రోచర్‌ను అందజేసి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, ఏవోఐ కర్నూలు ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్ర కుమార్‌లు మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను ప్రిన్సిపల్‌కు వివరించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌తో పాటు ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ తదితరులు అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈఎన్‌టీ వైద్య నిపుణులు, వైద్యులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. తొలిరోజు నిర్వహించే ప్రీ-కాన్ఫరెన్స్‌లో భాగంగా మానవ నమూనాలపై వివిధ ఈఎన్‌టీ ప్రొసీజర్లు, పరీక్షలు, ఆధునిక చికిత్సా విధానాలు, శస్త్రచికిత్సా పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేలా ప్రత్యేక వర్క్‌షాప్‌లు



నిర్వహించనున్నారు.

ఈ సదస్సు ద్వారా ఈఎన్‌టీ వైద్యరంగంలో అందుబాటులోకి వచ్చిన తాజా, అధునాతన పరిజ్ఞానాన్ని వైద్యులకు పరిచయం చేయడంతో పాటు, వైద్య నిపుణుల మధ్య అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి సదస్సుకు కళాశాల తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్ నిర్వాహకులకు తెలిపారు.



పశుగ్రాసం ఉచితంగా అందించాలి



ఉరవకొండ సెప్టెంబర్ 10(రిపబ్లిక్ న్యూస్)

వర్షాలు సకాలంలో కురవకపోవడంతో చిన్న, పెద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడిందని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాలరామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉరవకొండ మండల తహసీల్దార్ అరుణ కు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులతో పాటు పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పశువులకు అవసరమైన పశుగ్రాసం లభించకపోవడంతో వాటిని పోషించడం భారంగా మారిందన్నారు.

రైతులు, పశుపోషకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉచితంగా పశుగ్రాసం అందించాలని బాలరామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. పశుగ్రాసం కొరత నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, శివ, రాంబాబు, రమేష్, ఓబుళపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి టీజీ భరత్

రాష్ట్ర అభివృద్ధి, తాగునీరు, గృహనిర్మాణం, జలధారపై సమీక్ష

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 10)

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు.



సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, జీఎస్‌డీపీ వృద్ధి, తాగునీటి వసతులు, గృహనిర్మాణం, జలధారతో పాటు జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరిచే అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలన అందించాలని సూచించారు.

ఓర్వకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలి

- నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి
- తక్షణమే అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి
- గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి నాగన్న డిమాండ్

ఓర్వకల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

గురువారం రోజు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల నాయకులు ఎస్ మధుసూదన్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టి తాసిల్దార్ విద్యాసాగర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి నాగన్న మండల నాయకులు రామకృష్ణ మద్దిలేటి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు





మాట్లాడుతూ మండలంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదయిందని దీనివల్ల రైతులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఖరీఫ్ సీజన్ పూర్తయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించి కరువు ప్రాంతాలను ప్రకటించలేదని రైతు కౌలు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు ఇప్పటికైనా కరువు ప్రాంతాలను గుర్తించి తక్షణమే నష్టపోయిన రైతులకు ఎకరాకి 50 వేల రూపాయలు ఇవ్వాలని సహాయక చర్యలు చేపట్టాలని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పనులను అన్ని గ్రామాలలో ప్రారంభించి 200 రోజులు పనులు 700 రూపాయలు వేతనం ఇవ్వాలని రైతుల రుణాలను మాఫీ చేయాలని రేషన్ దుకాణాలలో 14 రకాల నిత్యవసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు నడిపి జయన్న శేషయ్య బషీర్ మద్దయ్య లక్ష్మీదేవి ఆంజనేయులు నాగన్న రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

నా పొలాన్ని వేరే వాళ్ళ పేర్లపై చేశారని దళిత మహిళ ఆవేదన

నా పొలం నాకు ఇప్పించి న్యాయం చేయాలని అధికారులకు విన్నపం

ఓర్వకల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట హుసేనాపురానికి చెందిన ఎం. ఝాన్సీ తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆవేదన వ్యక్తం చేశారు. 14 ఏళ్లుగా సర్వే నం.70లో ఎకరం 10 సెంట్ల భూమిని సాగు చేస్తున్నప్పటికీ, ఇటీవల ఆ భూమిని వేరొకరి షేక్ ఖజా బి అనే ఆమె పేరుతో



నమోదు చేశారని ఆరోపించారు. అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, కొంత మంది టీడీపీ నాయకులు కలిసి తనకు అన్యాయం చేశారని సోలార్ టవర్ పడుతుంది అని తెలుసుకుని డబ్బులు వస్తాయని తెలిసి వేరే వాళ్ళ పేరూ ఎక్కించారు. ఊరిలో ఎక్కడ కాలిగా ఉన్న భూమి చూసి అందులో మ్యాపింగ్ లో ఉండి ఆన్లైన్ లో పేర్లు ఎక్కని వాళ్ళ భూములు కబ్జా చేసి పెద్ద పెద్ద టెంకాయ చెట్లు సీతాఫల చెట్లు ఇలాంటివి నాటి వాళ్ళ కు ఉన్న బినామీ పేర్ల మీద దొంగ పాస్ బుక్ లు పుట్టించుకుంటున్నారు.ఇలాంటి నాయకుల వల్ల చంద్ర బాబు నాయుడు గారికి చెడ్డ పేరు తప్ప ఇంకేమి లేదు ఇలా చేయడం ఎంతవరకు న్యాయం ఇందుకేనా మేము ఓట్లు వేసి గెలిపించుకునేది మహిళా ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళితుల భూములు లాక్కోవద్దని పేద ప్రజలకి అన్యాయం చేయవద్దు అని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన సాగు భూమిని తిరిగి ఇప్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఆమెకు న్యాయం చేయాలి అని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పోషకాహార లోప నిర్మూలనకు కృషి చేయాలి



గుత్తి సెప్టెంబర్ 10(రిపబ్లిక్ న్యూస్)పోషకాహార లోప నిర్మూలనకు అంగన్‌వాడీ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని గుత్తి ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లమ్మ సూచించారు. గుత్తి ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం పోషణ్ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.సీడీపీవో ఎల్లమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారుల ఎత్తు, బరువు తదితర కొలతలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేసేటప్పుడు వంద శాతం ఖచ్చితత్వం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి, వారికి అవసరమైన పోషకాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.అంగన్‌వాడీ కార్యకర్తలకు లబ్ధిదారుల వివరాల నమోదు, పిల్లల ఎత్తు, బరువు కొలతలను డిజిటల్ విధానంలో ఖచ్చితంగా నమోదు చేసే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పోషణ్ మాసం కార్యక్రమం ఉద్దేశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

అనంతరం అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార లోప నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేశ్వరి, గౌరీ, రామలక్ష్మి,ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 10)

మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులోని చిల్డ్రెన్స్ పార్క్ ఎదురుగా ఉన్న జీఎంజే పాఠశాల ఆవరణలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్య రహిత సమాజం, మాదకద్రవ్య రహిత భారతదేశం నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో సరైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు





క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసలు కాకుండా, తమ భవిష్యత్తును సక్రమమైన మార్గంలో తీర్చిదిద్దుకోవాలని అన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ ఆరోగ్య మేరీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల ప్రవర్తన, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి ప్రవర్తనతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, ఈఎస్ఐఎఫ్, సీఐ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో మరో మైలురాయి

- ఇంటింటి చెత్త సేకరణను వేగవంతం చేసేందుకు రెండు బదిలీ కేంద్రాలు
- 100 శాతం ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యం : కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 10)

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యాన్ని సాధించేందుకు రెండు చెత్త బదిలీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. విశాల్ మార్ట్ వెనుక ఈ-ఆటోల చార్జింగ్ కేంద్రం వద్ద, జొహరాపురం రోడ్డులోని జీటీఎస్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ఇప్పటివరకు ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు సేకరించిన చెత్తను తరలించేందుకు గార్గేయపురం డంప్‌యార్డుకు వెళ్లాల్సి వచ్చేదని కమిషనర్ తెలిపారు. దీంతో వాహనాలు డంప్‌యార్డుకు వెళ్లి తిరిగి రావడానికి ఎక్కువ సమయం పట్టేదన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా జీటీఎస్ తరహాలో రెండు బదిలీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక ఈ-ఆటోల చార్జింగ్ కేంద్రం వద్ద ఒకటి, జొహరాపురం రోడ్డులోని జీటీఎస్ వద్ద మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చెత్తను పెద్ద కంపాక్టర్ వాహనాల్లోకి సులభంగా బదిలీ చేసేందుకు ప్రత్యేక ర్యాంపులు నిర్మించినట్లు తెలిపారు. మొత్తం మూడు కంపాక్టర్లు చెత్త తరలింపు చేస్తాయని పేర్కొన్నారు. ఇకపై ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో చెత్తను సేకరించిన అనంతరం



సమీపంలోని బదిలీ కేంద్రానికి చేరుకుని, అక్కడి కంపాక్టర్ వాహనాల్లోకి చెత్తను బదిలీ చేస్తాయని కమిషనర్ తెలిపారు. అనంతరం కంపాక్టర్ వాహనాలు చెత్తను నేరుగా గార్గేయపురం డంప్‌యార్డుకు తరలిస్తాయని చెప్పారు.ఈ విధానం ద్వారా చెత్త సేకరణ వాహనాలు డంప్‌యార్డుకు వెళ్లి తిరిగి రావడానికి పట్టే సమయం తగ్గుతుందని కమిషనర్ పేర్కొన్నారు. అదా అయ్యే సమయాన్ని ఇంటింటి చెత్త సేకరణకు వినియోగించుకోవడం ద్వారా మరిన్ని ఇళ్ల నుంచి చెత్తను సేకరించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యాన్ని మరింత సమర్థవంతంగా సాధించేందుకు ఈ విధానం దోహదపడుతుందని చెప్పారు.

వినాయక ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

అంతకుముందు అధికారులతో కలిసి వినాయక ఘాట్‌ను పరిశీలించిన కమిషనర్, ఇళ్లలో ప్రతిష్ఠించే చిన్న మట్టి విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన సమయానికి వర్షాలు కురిస్తే నీరు నిల్వ ఉండేలా నిర్మిస్తున్న అడ్డుకట్ట పనులను పరిశీలించారు. అడ్డుకట్ట నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వర్షాలు కురిసి తగినంత నీరు అందుబాటులోకి వస్తే చిన్న విగ్రహాల నిమజ్జనానికి వినాయక ఘాట్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుందని కమిషనర్ తెలిపారు.నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలో ఉత్పత్తయ్యే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణలో నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలకు సహకరించి పరిశుభ్రమైన కర్నూలు సాధనకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎంఈ గిరిరాజ్, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, జిలానీ, ఫరూక్, శివశంకర్, మునిస్వామి, వెహికల్ ఇంచార్జీ కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు ఎంపికైన వారికి వైద్య పరీక్షలు

అమరావతి,సెప్టెంబరు 10(రిపబ్లిక్ న్యూస్):

పవిత్ర హజ్ యాత్ర-2027(1448-హెచ్)కు దరఖాస్తు చేసుకొని ఎంపికైన హాజీలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీచేసిన సర్కులర్ ప్రకారం తప్పనిసరిగా నిర్దేశిత వైద్య పరీక్షలు చేయించుకుని శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉందని గురువారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు (డిఎంహెచ్వోలు) ఆదేశాలను రాష్ట్ర హజ్ కమిటీ జారీ చేయడం కూడా జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఎంపికైన హజ్ యాత్రికులకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు/ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.అధీకృత ప్రభుత్వ అల్లోపతిక్



వైద్య అధికారులు నిర్దేశిత వైద్య పరీక్షలు నిర్వహించి, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్దేశించిన నమూనాలో వైద్య పరీక్షలు, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారని మంత్రి ఫరూక్ వెల్లడించారు.

యాత్రికులు గమనించాల్సిన ముఖ్య అంశాలు

హజ్ యాత్రికులు ముఖ్యంగా కొన్ని ముఖ్య అంశాలను తప్పనిసరిగా గమనించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

1.నిర్దేశిత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం/ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

2.నిర్దేశిత నమూనాలో వైద్య పరీక్షలు& శారీరక దృఢత్వ ధ్రువీకరణను పొందాలి.

3.వైద్య పరీక్షల నివేదికలు, అసలైన శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను భద్రంగా ఉంచుకోవాలి. ఇవి తదుపరి దశలో జరిగే వైద్య పరీక్షలు, టీకాల సమయంలో అవసరం అవుతాయి.

4.అవసరమైన పత్రాలను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పోర్టల్లో ఈ నెల 15 వ తేది లోపు అప్లోడ్ చేయడం లేదా రాష్ట్ర/జిల్లా హజ్ కమిటీ కార్యాలయాలకు సమర్పించడం చేయాలి.

జిల్లాల వారీగా వైద్య పరీక్షలకు ఆదేశం

రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆయా జిల్లాల హజ్ సొసైటీల ప్రతినిధులు సమన్వయంతో వైద్య పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యం అవ్వాలని మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు.హజ్-2027కు తాత్కాలికంగా ఎంపికైన రాష్ట్రం లోని యాత్రికులందరూ నిర్దేశిత గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసుకుని, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను పొందాలని మంత్రి ఫరూక్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు

మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-2 ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పెంపు

15వ తేదీ వరకు గడువు పెంచిన ప్రభుత్వం

మైనారిటీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు




అమరావతి,సెప్టెంబరు 10(రిపబ్లిక్ న్యూస్) :

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్-2026ను అనుసరించి గ్రూప్-2 పరీక్షలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు గడువును పెంచినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని మంత్రి గుర్తు చేశారు.అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-1 సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు మొదట ఈనెల 10వ తేదీ వరకు గడువు నిర్దేశించడం జరిగిందన్నారు.దరఖాస్తు సమర్పణ గడువును 15 వ తేదీ వరకు పొడిగించామని మంత్రి తెలిపారు.ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడిగించిన గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 సివిల్ పరీక్షకు హాజరుకావాలనుకునే మైనారిటీ అభ్యర్థులకు శ్రేష్ఠమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సహకారాన్ని అందించడమే ఉచిత శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం),మైనారిటీ సంక్షేమ శాఖ,వెబ్సైట్: https://apcedmmwd.org ఫోన్: 08645-297535 / 7386789966. సంప్రదించాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

పాలనలో రియాక్టివ్ కాదు.. ప్రోయాక్టివ్ విధానం ఉండాలి

అభివృద్ధి, సేవల్లో వేగం పెంచాలి.. టెక్నాలజీని విస్తృతంగా వినియోగించాలి: సీఎం చంద్రబాబు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 10)



రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేస్తూ ప్రతి శాఖలోనూ సంస్కరణలు చేపట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో జరిగిన 8వ కలెక్టర్ల సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రంలో పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు టెక్నాలజీని విస్తృతంగా వినియోగించాలని కలెక్టర్లకు సూచించారు.

ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేస్తూ లక్ష్యాల సాధనను ఎప్పటికప్పుడు బేరీజు వేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు జీఎస్డీపీని లెక్కించి రాష్ట్ర ప్రగతిలో ఎక్కడ ఉన్నామో పరిశీలిస్తున్నామన్నారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుని ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్రం 13.44 శాతం వృద్ధిరేటును నమోదు చేసిందని వెల్లడించారు. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదైందని, గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జీఎస్టీ వసూళ్లు రూ. 25,450 కోట్ల మేర పెరిగాయని చెప్పారు.

రాష్ట్రంలో వనరులు, సాంకేతికత అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని చోట్ల నాయకత్వ లోపం ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ కోర్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాభివృద్ధి కోసం నిర్వహించామని తెలిపారు.



డీప్‌టెక్ గవర్నెన్స్ ద్వారా అనూహ్యమైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉందన్నారు. డేటా లేక్, అవేర్ వంటి వ్యవస్థలను వినియోగించి నిర్ణయాలు తీసుకోవడంలో వేగం పెంచాలని, ప్రజలకు అందించే సేవల్లో నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. గతంలో 50 ఏళ్లలో సాధించే అభివృద్ధిని ప్రస్తుతం 1015 ఏళ్లలోనే సాధించే అవకాశం ఉందన్నారు.

ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అభివృద్ధి, పాలన కూడా పెండింగ్‌లో ఉన్నట్టేనని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం హయాంలో మార్కెట్‌లోకి వచ్చిన జే-బ్రాండ్ మద్యం వల్ల 30 వేల మంది చనిపోయారని చంద్రబాబు ఆరోపించారు. వారి ఆరోగ్యం కూడా దెబ్బతిన్నదన్నారు. కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకంగా మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ టారిఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

బ్రాహ్మణపల్లి గ్రామంలో నీటి కొరత



ఓర్వకలు ప్రతినిధి, సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో ఏర్పడిన నీటి సమస్య గురించి ప్రజలు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి , ఎంతీఎజూ నంద్యాల జిల్లా అధ్యక్షులు, ని మా గ్రామంలో నీళ్లు సరింగా రావడం లేదని వారి దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే వారు వెంటనే స్పందిచి గ్రామంలో ట్యాంకర్లను ఏర్పాటు చేసి బ్రాహ్మణపల్లె గామప్రజలకు ఉచిత నీటీ సరఫర చెయ్యడం జరిగింది.సమస్య విన్న వెంటనే స్పందించి ట్యాంకర్లను ఏర్పట్ చేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కి బ్రాహ్మణపల్లె గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి గ్రామ వైఎస్ఆర్సిపి కార్యకర్తలు బలరాం గోపాల్ రెడ్డి దేవరాజు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ - రోడ్డు భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి

రహదారి ప్రమాదాలు ట్రాఫిక్, రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన


నంద్యాల క్రైం, సెప్టెంబర్ 10, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రతి చోట ప్రజలతో పోలీసుల సాన్నిహిత్యం ఉండేలా ముందస్తు నేరాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్ల వద్ద,రద్దీ ప్రదేశాలలో, బ్లాక్ స్పాట్ల వద్ద విజిబుల్ పోలీసింగ్, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

పోలీసు వారి ముఖ్య సూచనలు

18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపరాదు. నిబంధన ఉల్లంఘిస్తే తల్లిదండ్రులు/సంరక్షకులపై చట్టపరమైన చర్యలు తప్పవు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ పెట్టుకోవడం అనివార్యం. ఇది ప్రాణాలను కాపాడే భద్రతా కవచం. వేగం కన్నా ప్రాణం మిన్న అనే సూత్రాన్ని ఎప్పుడూ మరువరాదు. వాహనాల పరిమితికి మించి వస్తువులను ప్రయాణికులను రవాణా చేయరాదు. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరం.



అటువంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. వాహనాలు నడుపు సందర్భంలో సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని తద్వారా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మోటర్ సైకిల్ పై ప్రయాణించేటప్పుడు త్రిబుల్ రైడింగ్ చేయడం వలన వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ప్రజలందరూ ట్రాఫిక్, రోడ్డుభద్రత నిబంధనలు కచ్చితంగా పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు.



జీవితం మీది రక్షణ మీ చేతుల్లోనే! అనే విషయాన్ని ఎల్లప్పుడూ మరవరాదని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమాన విధించడం జరిగింది.

బంటనహాల్ - గుంతకల్ బి.టి. రోడ్డు పనులను పరిశీలిన

పనులను అత్యంత వేగంగా పూర్తి చేస్తాం - ఆర్ అండ్ బి డి.ఈ. జె. కృష్ణజ్యోతి

చిప్పగిరి, సెప్టెంబర్, 10, (రిపబ్లిక్ న్యూస్)



చిప్పగిరి మండలం బంటనహాల్ గ్రామం నుండి గుంతకల్లు వెళ్లే బి.టి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనలో భాగంగా రోడ్లు, భవనాల శాఖ డివిజనల్ ఇంజనీర్ జె. కృష్ణజ్యోతి గురువారం గ్రామాన్ని సందర్శించారు.ఈ పర్యటనలో భాగంగా డి.ఈ. కృష్ణజ్యోతి గారు ముందుగా గ్రామంలోని స్థానిక సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై రోడ్డు నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా డి.ఈ. మాట్లాడుతూ... ఈ నెల 12వ తేదీన గుంతకల్లు శాసనసభ్యులు శ్రీ గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా రోడ్డు నిర్మాణ పనులకు అధికారికంగా భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. భూమి పూజ పూర్తయిన వెంటనే పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.ఏళ్ల తరబడి సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తమ కల నెరవేరబోతుండటంతో బంటనహాల్ గ్రామ ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు

రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన



నంద్యాల క్రైం, సెప్టెంబర్ 10, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో, వార్డులలో మహిళల భద్రత,రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్ ప్రయోజనాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు జిల్లా శక్తి టీం బృందాలు, ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలోని గ్రామాలలో సంబంధిత పోలీస్ అధికారులు వారి సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలు, మహిళలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డులలో సాధారణ ప్రజలు, మహిళలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, భద్రతకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, మహిళల భద్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా,మీ దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న శక్తి యాప్ వినియోగం, దాని ద్వారా పొందగలిగే భద్రతా సేవల గురించి వివరించారు. మహిళలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమకు ఎదురయ్యే సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, 100 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని, అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఆర్థిక మోసాలు వంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ఆలస్యం చేయకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న పోలీసు భద్రతా, అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.



ఆరవ విడత భూ రీ సర్వే గ్రామసభ

చిప్పగిరి, సెప్టెంబర్, 10, (రిపబ్లిక్ న్యూస్)



చిప్పగిరి నందు గురువారం భోగేశ్వర స్వామి గుడి దగ్గర ఆరవ విడత భూ సర్వే గ్రామసభ డిప్యూటీ తాసిల్దార్ మహేష్, ఆర్ఐ సునీత, మండల సర్వే నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు పాల్గొన్నారు, కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూవివాదాలు హద్దులు తగాదాలు శాశ్వతంగా సరిదిద్దటం జరుగుతుందని, సర్వే విధానంపై స్థానిక రైతులకు ముందస్తు సమాచారం ఇస్తామని, భూ రికార్డులు అనంతరం వచ్చే అభ్యంతరాలను స్వీకరించి పారదర్శకంగా విచారణ చేపట్టి పరిష్కరిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ డిటి వినోద్ కుమార్, వీఆర్వో గోవిందప్ప ,గాదిలింగ, గ్రామ సర్వేయర్స్ నరేంద్రబాబు, శ్రీలక్ష్మి, వీర, మల్లికార్జున, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకటరాముడు మృతి

గుత్తి సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)



గుత్తి మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటరాముడు అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు.వెంకటరాముడు గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండేవారని గ్రామస్థులు తెలిపారు. ఆయన మృతితో బాచుపల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.వెంకటరాముడు మృతి విషయం తెలుసుకున్న గ్రామస్థులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాల వారు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

బీసీ బాలుర వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల సందర్శన



గుంతకల్ సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)
అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అనంతపురం జిల్లా సమితి పిలుపు మేరకు చేపట్టిన హాస్టళ్ల సందర్శన కార్యక్రమంలో భాగంగా గుంతకల్ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, పట్టణ కోశాధికారి యశ్వంత్, పట్టణ నాయకులు మనోజ్, సందీప్, గాదిలింగ, హరి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న పుల్లంపేట మండల తాసిల్దార్ని సస్పెండ్ చేయాలి : కామ్రేడ్లు డిమాండ్.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 10రిపబ్లిక్ న్యూస్.
పుల్లంపేట మండలంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వాభూములు కబ్జా చోరుల కబంద హస్తలలోకి పోతుంటే సదరు తాసీల్దారు మురళీకృష్ణ కబ్జాదారులకు తమ్ముడిలా కొమ్ముకాస్తున్నారని కామ్రేడ్లు తీవ్ర ఆరోపణలు చేశారు,తిరుపతి జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే తహసీల్దార్ని సస్పెండ్ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్చేస్తున్నారు, పుల్లంపేట మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ మండల పార్టీ కార్యదర్శి రాజు బోయిన సెల్వన్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగినది,ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో దళాయిపల్లి పంచాయతీ సర్వే నెంబర్, 212 లో ఉన్న కొంత భూమిని పక్కనే ఉన్న దళాయపల్లి దళిత మైనారిటీలు దాదాపు పది సంవత్సరముల నుండి సదరు భూమిని మనిషికి 1 ఎకరా 50 సెంట్లు కేటాయించుకుని లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వర్షాధారు పంటలు పండించుకుంటూ జీవనం గడుపుతున్నటువంటి దళిత మైనారిటీల పైన ఈరోజు పుల్లంపేట మండల తాసిల్దారుగా మురళీకృష్ణ వచ్చి దళిత మైనారిటీల పైన కక్ష కట్టి సదరు భూమి లోకి పోయి ఫెన్సింగ్, పోళ్లను పగలగొట్టి ఫెన్సింగ్ వైర్లు కట్ చేసి పూర్తిగా ఒక్కొక్కరికి మూడు నుండి నాలుగు లక్షల వరకు



నష్టం చేసినటువంటి తాసిల్దార్ ని వెంటనే జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసి దళిత మైనార్టీలకు నష్టపరిహారం చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేశారు,పుల్లంపేట మండలంలో 9 పంచాయతీల్లో ఎక్కడ పట్టిన భూకబ్జాలు ఎక్కువై పోతూన్నాయని తహసిల్దార్ మురళీకృష్ణ చూసి చూడనట్లుగా భూకబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు,

కబ్జాకు గురైనటువంటి భూములు పేర్లు
పుత్తన వారి పల్లి గ్రామపంచాయతీలో సర్వే నెంబర్లు 1066/1. 1066/2. 1066/3. 1066/4. 1066/5
సదురు భూములు లో ఉన్నటువంటి పెన్సింగ్ ను మరియు మామిడి మొక్కలను తొలగించి సదరు భూమిని అక్కడే ఉన్నటువంటి మోడల్ స్కూలు డెవలప్మెంట్ కు కేటాయించాలని అన్నారు. అదేవిధంగా రంగంపల్లి



గ్రామపంచాయతీలో సర్వేనెంబర్ 585 లో దాదాపు 200 ఎకరం భూమి కబ్జాకు గురయింది సదరు భూము లో ఉన్న కరెంటు పోలను. ట్రాన్స్ఫార్ ను. ఫెన్సింగ్ ను తొలగించి సదరు భూమి పక్కనే ఉన్నటువంటి కరేపాకు రాసిపల్లి ఎస్టీ కాలనీవాసులకు, అక్కడే ఉన్నటువంటి పేద నిరుపేద అయినటువంటి వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గ సభ్యులు గానికి పెంట ఆదినారాయణ,చింతలపూ రి నాగమ్మ, డి హెచ్ పి ఎస్ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి కటారి గోపాల్,పెనమలూరు మండల సహాయ కార్యదర్శులు ఈరి లక్ష్మీనారాయణ, రేవురు శంకరయ్య,దళాయిపల్లి గ్రామ ప్రజలు సిద్ధి ఖాన్, హరి,జీ మణి, జి శివయ్య, ఎం సుబ్బరాయుడు, పి మహేష్, మనీ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి..

గుత్తి సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)
గుత్తి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున పోటీ చేసేందుకు చిన్న వెంకటేష్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కూటమి పొత్తులో భాగంగా అనంతపురం జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో జనసేన పార్టీకి ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.కూటమిలో భాగంగా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో జనసేన పార్టీకి ఎక్కువ స్థానాలు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు అధిష్ఠానం నుంచి సంకేతాలు ఉన్నాయని తెలిపారు. గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం మున్సిపాలిటీలతో పాటు మేజర్ పంచాయతీగా ఉన్న పామిడికి సంబంధించి కూడా జనసేనకు అవకాశం దక్కే అవకాశాలపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గుత్తి మున్సిపల్ చైర్మన్ పదవికి జనసేన పార్టీ తరఫున పోటీ చేసేందుకు చిన్న వెంకటేష్ తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గుత్తి పట్టణంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తున్నట్లు చెప్పారు.
కూటమి పార్టీల మధ్య సీట్ల కేటాయింపులో భాగంగా గుత్తి మున్సిపల్ చైర్మన్ పదవి జనసేనకు దక్కితే పార్టీ తరఫున బలమైన అభ్యర్థిని నిలబెట్టి విజయం సాధించేందుకు కృషి చేస్తామని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం తుది నిర్ణయం కోసం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

చిన్నారి ఘటన బాధాకరం

ట్రెల్లిస్ స్కూల్ యాజమాన్యం
పోలీసులకు నిందితుడిని అప్పగించాం
మధ్యవర్తుల హవా రూ.25 లక్షల బేరం
ఆ కుటుంబానికి ఒక ప్లాట్ రాసివ్వాలంటూ హెచ్చరిక
బెదిరింపులకు తలొగ్గని స్కూల్ యాజమాన్యం
బాధిత కుటుంబానికి న్యాయం జరిగేనా
మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన స్కూల్ యాజమాన్యం

అనంతపురం క్రైమ్, సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):
చిన్నారిపై జరిగిన ఘటన బాధాకరమని ట్రెల్లిస్ స్కూల్ యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ స్కూల్లో విద్యార్థినికి సంబంధించిన ఘటనపై పాఠశాల యాజమాన్యం స్పందించింది. ఈ ఘటన జరగడం వాస్తవమేనని, విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే అత్యంత సున్నితంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. చిన్నారి విషయంలో తల్లిదండ్రుల ఆవేదనను తాము అర్థం చేసుకుంటున్నామని, ఘటన తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. స్కూల్ యాజమాన్యం మీడియా సమావేశం నిర్వహించి వివరణ ఇచ్చింది.
చట్టపరమైన దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం
పాఠశాలలో చదువుతున్న చిన్నారి విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం గోప్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై



ఉందని యాజమాన్యం పేర్కొంది. బాలికకు సంబంధించిన వివరాలు బయటకు వెల్లడించడం సరికాదని, ఈ విషయంలో మీడియా, ప్రజలు సంయమనం పాటించాలని కోరింది. పిల్లల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం ఎలాంటి రాజీకి తావివ్వదని స్పష్టం చేసింది.ఘటన తమ దృష్టికి వచ్చిన వెంటనే నిందితుడు తప్పించుకోకుండా అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించామని యాజమాన్యం వివరించింది. ఈ వ్యవహారంలో చట్టపరమైన దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపింది. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని పేర్కొంది.ఇదిలా ఉండగా, ఘటనను ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు బేరసారాలకు పాల్పడుతున్నారంటూ యాజమాన్యం ఆరోపించింది.
తల్లిదండ్రులతో కూడిన "స్పార్క్"కమిటీ ఉంది
పోక్సో చట్ట నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నామని, ఘటనపై పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేసింది. పాఠశాలలో తల్లిదండ్రులతో కూడిన "స్పార్క్" కమిటీ కూడా ఉందని, పాఠశాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించింది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న కొన్ని వీడియోలు ఎడిట్ చేయబడి, వాస్తవ పరిస్థితిని తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. అసలు విషయాలను స్పష్టంగా నిర్ధారించేందుకు పాఠశాలలోని సీసీ కెమెరా ఫుటేజ్‌తో పాటు సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వివరాలను పోలీసులకు అందజేశామని తెలిపింది.
చట్ట ప్రకారం శిక్షను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం
తల్లిదండ్రులు ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయలేదని స్పష్టం చేసింది. అయితే ఘటన ద్వారా తమను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఈ విషయంలో ఎవరైనా కుట్రపూరితంగా వ్యవహరించినట్లయితే పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపింది.తమ వద్ద ఉన్న ఘటనకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలను పోలీసుల దర్యాప్తులో భాగంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని యాజమాన్యం స్పష్టం చేసింది. తమ వైపు ఏమైనా తప్పిదం జరిగినట్లు దర్యాప్తులో తేలితే చట్ట ప్రకారం శిక్షను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.
పిల్లల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని, విద్యార్థుల రక్షణ కోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని యాజమాన్యం వెల్లడించింది. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అప్పటి వరకు నిర్ధారణ కాని అంశాలపై ఊహాగానాలు, ప్రచారాలు చేయకుండా సంయమనం పాటించాలని కోరింది. ఈ సంఘటనతో విలపిస్తున్న బాధిత విద్యార్థిని కుటుంబానికి స్కూల్ యాజమాన్యం ఏ మేరకు న్యాయం చేస్తారన్నది వేచి చూడాల్సిందే.

విద్య నేర్పిన గురువుకు ఘన సన్మానం



మల్లాపూర్ సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)
రేగుంట పాఠశాల SSC 2009-2010 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ ప్రియమైన గురువు నర్సింగ రావుకు ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు రావడంతో వారిని రేగుంట పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో గురువుకు శాలువా కప్పి సత్కరించి, మిఠాయిలు తినిపించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు చిన్నప్పుడు విద్యా బుద్దులు నేర్పిన గురువు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం చాలా సంతోషకరమైన విషయమని, జీవితంలో గురువు గారు చూపిన మార్గం మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీష్, మహిపాల్, ప్రశాంత్, శ్రీకాంత్, సల్మాన్, నరేంద్ర చారి, రమేష్, వినోద్, అంజి, లక్ష్మణ్ , ఎవీ శంకర్ బాబు మరియు ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఇటుకలపల్లి పోలీసులు సూచన -మండపాలకు అనుమతులు తప్పనిసరి.. డీజేలకు నో

ఇటుకలపల్లి క్రైమ్, సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):
వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించాలని ఇటుకలపల్లి పోలీసులు సూచించారు. అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.మండపాలు, స్వాగత తోరణాల వల్ల రహదారులు, ఫుట్‌పాత్‌లపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, విద్యుత్ వైరింగ్, లైటింగ్ ఏర్పాట్లను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లు వినియోగించరాదన్నారు. డీజేలకు అనుమతి లేదని, లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టమ్స్‌ను నిబంధనలకు లోబడి మాత్రమే వినియోగించాలని తెలిపారు.ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా రెచ్చగొట్టే నినాదాలు, పాటలు, ప్రసంగాలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు వార్తలను నమ్మవద్దని, అలాంటి



పోస్టులను ఫార్వర్డ్ చేయకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మండపాల వద్ద నిర్వాహకులు, వాలంటీర్లు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.నిమజ్జన ఊరేగింపుల్లో పోలీసులు సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. చిన్నారులు, ఈత రాని వ్యక్తులు నీటిలోకి దిగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని,



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్ హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ పాటించి వేడుకలను సురక్షితంగా నిర్వహించాలని కోరారు.

లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు.. ఎర్రకోట వద్ద పేల్చారు..

ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కొత్త కోణం!

ఢిల్లీ సెప్టెంబరు 10 (రిపబ్లిక్ న్యూస్):
దేశ రాజధాని ఢిల్లీని 2025లో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సంచలన విషయాలను వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవాదులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని

తెలిపింది.2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలు లక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్ (జైన దేవాలయం). పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. అయితే, ఆ సమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు.అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోటలోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంలో లభించిన ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఈ ఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఏ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది. సీసీటీవీ ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగుతున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు. కేవలం ట్రాఫిక్ కారణంగా ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెను ప్రమాదం నుంచి బయటపడటం గమనార్హం.

సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు చెలిమిళ్ళ శెట్టి.నాగరాజు పార్థివ దేహానికి నివాళులు

పాములపాడు సెప్టెంబర్ 10 రిపబ్లిక్ న్యూస్:-పాములపాడు మండలంలోని, చెలిమిళ్ళ గ్రామంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యునిగా మరియు గ్రామ శాఖ కార్యదర్శిగా ఉంటూ శ్రీ చైతన్య విద్యా సంస్థ హాస్టల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన శెట్టి.నాగరాజు(48)కు కు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.స్వామన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.బాలయ్య, తదితర పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి, విప్లవ జోహార్లు, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేలిమిళ్ళ గ్రామ శాఖ కార్యదర్శిగా ఉంటూ, మండల కమిటీ సభ్యునిగా పనిచేసి సిపిఎం పార్టీకి ఎల్లవేళలా అండగా ఉన్నారన్నారు. కుటుంబ పోషణ కోసం ఆయన కర్నూలు శ్రీ చైతన్య హాస్టల్లో ఫుడ్ వర్క్ మాస్టర్ గా పని

చేస్తూ ప్రమాదశాత్తు వల్ల చనిపోవడం జరిగిందన్నారు. ఆయన లేని లోటు సిపిఎం పార్టీకి తీరనిది అన్నారు. వారి తండ్రి సుందరావు గత కొన్ని సంవత్సరాలు నుంచి పార్టీ సానుభూతిపరునిగా ఉంటూ పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. ఆయన మరణం ప్రజాసేవకు, కుటుంబానికి తీరని లోటని ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శెట్టి.నాగరాజుకు తండ్రి సుందరావు, తల్లి సుశీలమ్మ, భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన కుటుంబానికి హాస్టల్ యాజమాన్యం, ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. నివాళులు అర్పించిన వారిలో రమణమ్మ, పురుషోత్తం, బాల యేసు, ఉన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది.

రాయికల్ పట్టణ ఇందిరానగర్ రోడ్డుపై బురద నీరు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

జన సేన మూడో వార్డ్ కౌన్సిలర్ చోహన్ శ్రీనివాస్ ఆరోపణ





రాయికల్ మండలం సెప్టెంబర్,10(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని చౌహాన్ శ్రీనివాస్ జనసేన పార్టీ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేశాను, మా వార్డ్ సమస్యలపై మా వార్డు కౌన్సిలర్ రాకేష్ నాయక్ సమస్యలు తెలపడం జరిగింది, ఇంద్రనగర్ కాలనిలో 3వ వార్డులో ఇళ్లలోకి వెళ్ళడానికి స్కూల్ పిల్లలు నడవడానికి వీలు లేకుండా ఉంది దారి వర్షం పడిన బురుద మయం అవుతుంది డ్రైనేజి కూడా క్లీన్ లేదు మా వార్డు కౌన్సిలర్ రాకేష్ నాయక్ దృష్టికి తీసుకెళ్ళాను ఈ దారి స్కూల్ వెళ్లే దారి కూడా క్లీన్ ఉండదు మరియు డ్రైనేజీ సమస్య మా కాలనీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు మరియు వృద్ధులు నడుచుకుంటూ వెళ్లాలంటే పాములు తేలు విషపురుగులు తిరుగుతూ ఉండేవి మా యొక్క వార్డ్ కౌన్సిలర్ రాకేష్ నాయక్ తో మాట్లాడంతో వెంటనే స్పందించి త్వరగా హుటా హుటిన సమస్య పరిష్కారం చేసారు

రాయికల్ విశ్వశాంతి పాఠశాలలో కాళోజీ నారాయణ రావు గారి జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు



రాయికల్ మండలం సెప్టెంబర్,10(రిపబ్లిక్ న్యూస్) జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో కాళోజీ నారాయణ రావు గారి జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.విద్యార్థినీవిద్యార్థులందరికీ పాఠశాల ఆ మహనీయుని గొప్పతనాన్ని చాలా చక్కగా వివరించి చెప్పారు.పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ ఈరోజు మనం తెలంగాణ జాతి గర్వించదగ్గ మహాకవి, ప్రజా వాణి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు గారి జయంతిని జరుపుకుంటున్నాము. ఈ రోజును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా "తెలంగాణ భాషా దినోత్సవం"గా ప్రకటించుకోవడం మన అందరికీ ఎంతో గర్వకారణం. కాళోజీ కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. ప్రజల కష్టాలను, కన్నీళ్లను తన కవితల్లో ప్రతిబింబించారు. "అన్యాయాన్ని ఎదిరించాలి, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి" అని తన రచనల ద్వారా చాటిచెప్పారు. నిజాం నిరంకుశ పాలనను, అరాచకాలను తన కలంతో గట్టిగా ఎదిరించిన నిర్భయ యోధుడు ఆయన. "నా గొడవ" పేరుతో ఆయన రాసిన కవిత్వం ప్రతి ఒక్కరిలోనూ చైతన్యాన్ని నింపింది. ప్రజల భాషలోనే సాహిత్యం ఉండాలని నమ్మిన గొప్ప వ్యక్తి కాళోజీ. మన తెలంగాణ యాసలోని పదునును, సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు.ఆయన ఆశయాలను స్మరిస్తూ, సమాజంలో మంచిని కోరుకుంటూ, మన మాతృభాషను గౌరవిద్దాం. ఈ గొప్ప మహనీయుని మార్గంలో నడుద్దాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్ మరియు ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అఫ్సర్,రజిత,సంజన,ఇందుజ,మంజుల, ప్రవంతి,కవిత ,సాయిహర్ష, దీపిక,శివాని,సౌజన్య ,కళ్యాణి,మాలతి,అహల్య,గాయత్రి,గీత రాణి, ప్రవళిక,కావ్య,ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పశువులను పూజించడం ఆనవాయితీ

నేడు పోలాల అమావాస్య!!



రాయికల్ మండలం సెప్టెంబర్,10(రిపబ్లిక్ న్యూస్)

ప్రతియేటా శ్రావణమాసంలో వచ్చే అమావాస్యను హైందవ సంస్కృతి సాంప్రదాయాల లో పోలాల అమావాస్య గా భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారని, జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ అన్నారు. రైతులకు తోడునీడగా నిలిచిన పశువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని చాటుకోవడం భారతీయ సంప్రదాయాల్లో ఒక విశిష్టమైన ఆచారమని అలాంటి గొప్ప భావనను ప్రతిబింబించే పర్వదినమే పోలాల అమావాస్య అని ఈ సందర్భంగా పశువులను పూజించడం, ప్రత్యేక పూజలు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు. వ్యవసాయాధారిత మన సమాజంలో ఆవులు, ఎద్దులు, బర్రెలు, దున్నలు వంటి పశువులు రైతులకు ఎంతో తోడ్పాటునందించేవి. పొలం దున్నడం మొదలు అనేక వ్యవసాయ పనుల్లో అవి రైతుకు అపారమైన సహాయం చేసేవి.

వర్షాకాలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగి, నాట్లు పూర్తయి శ్రావణ బహుళ అమావాస్య సమయానికి పొలాలన్నీ పచ్చని పచ్చదనంతో కళకళలాడుతుంటాయి. పశువులకు కూడా కొంత విశ్రాంతి లభించేది. తమ శ్రమతో రైతుకు, వ్యవసాయానికి మేలు చేసిన పశువుల పట్ల కృతజ్ఞతగా రైతులు వాటిని నీటితో శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు వేసి, అలంకరించి, ప్రేమతో పూజించడం సంప్రదాయంగా మారింది. ఈ ఆచారంలో మనిషిపశువు మధ్య ఉన్న అనుబంధం, రైతు హృదయంలోని కృతజ్ఞతాభావం ప్రతిఫలిస్తాయి.

పోలాల అమావాస్యను ముఖ్యంగా సంతానం కలిగిన మహిళలు తమ పిల్లల ఆయురారోగ్యాల, క్షేమం కోసం భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. సంతాన సౌభాగ్యం, పిల్లల శ్రేయస్సు కోసం ఈ వ్రతాన్ని నిర్వహించడం అనేక ప్రాంతాల్లో సంప్రదాయంగా కొనసాగుతోంది.

పాలాల అమావాస్య ప్రత్యేకత

పురాణ గాథల ప్రకారం పూర్వం ఒక గ్రామంలో బ్రాహ్మణ దంపతులు నివసించేవారు. వారికి ఏడుగురు కుమారులు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత ఆ ఏడుగురికీ వివాహాలు జరిపించారు. కాలక్రమంలో వారికి సంతానం కూడా కలిగింది. ఏడుగురు కుమారులు అదే గ్రామంలో వేర్వేరుగా కాపురాలు ఏర్పాటు చేసుకున్నారు.

తమ పిల్లలు క్షేమంగా, సుఖసంతోషాలతో ఉండాలంటే శ్రావణమాసంలో వచ్చే అమావాస్య రోజున పోలాంబ అమ్మవారిని పూజిస్తూ వ్రతం ఆచరించాలని పెద్దలు చెప్పడంతో, ఆ కుటుంబంలోని వారందరూ శ్రావణమాసం కోసం ఎదురుచూసేవారు.

శ్రావణమాసం రాగానే ఆ మాసంలో వచ్చే ముఖ్యమైన పూజలు, వ్రతాలన్నింటినీ భక్తితో ఆచరించారు. చివరిగా వచ్చే పోలాల అమావాస్య వ్రతాన్ని కూడా ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఆ వ్రతం రోజున ఉదయాన్నే చివరి కుమారుడి కుమారుడు మరణించడంతో కుటుంబమంతా విషాదంలో మునిగిపోయింది. దీంతో ఆ ఏడాది వ్రతాన్ని



ఆచరించలేకపోయారు.

మరుసటి సంవత్సరం మళ్లీ వ్రతం చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ విధివశాత్తు ఆ ఏడాది కూడా చివరి కుమారుడి మరో బిడ్డ మరణించడంతో వ్రతం చేయడం సాధ్యపడలేదు. ఇలా ప్రతి ఏడాది వ్రతానికి ఏర్పాట్లు చేసుకోవడం, అనుకోని విషాదం సంభవించడం, వ్రతం వాయిదా పడటం వరుసగా ఏడేళ్లపాటు కొనసాగింది.

దీంతో మిగిలిన ఆరుగురు కోడళ్లు, "ఏడో కోడలి కారణంగానే మనం వ్రతం చేయలేకపోతున్నాం" అంటూ ఆమెను నిందించేవారు. ఈ మాటలతో ఏడో కోడలు తీవ్రంగా మనస్తాపానికి గురయ్యేది.

ఎనిమిదో సంవత్సరం కూడా పోలాల అమావాస్య వ్రతానికి ఏర్పాట్లు చేశారు. అయితే ఆ రోజూ ఏడో కోడలి బిడ్డ మరణించాడు. ఈ విషయం బయటకు తెలిస్తే మళ్లీ తననే నిందిస్తారనే ఆవేదనతో, తన దుఃఖాన్ని మనసులోనే దాచుకుని ఆమె మిగిలిన వారితో కలిసి వ్రతంలో పాల్గొంది. అందరూ భక్తిశ్రద్ధలతో పూజ చేస్తుంటే, ఆమె మాత్రం తన గుండెలోని బాధను దిగమింగుకుంటూ యాంత్రికంగా వ్రతాన్ని పూర్తి చేసింది.

రాత్రి బాగా చీకటి పడింది. గ్రామంలోని వారందరూ నిద్రలోకి జారుకున్న తర్వాత, ఆమె తన బిడ్డను తీసుకుని గ్రామ పొలిమేరలో కొలువై ఉన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అమ్మవారి సన్నిధిలో తన బిడ్డను ఉంచి, దుఃఖంతో కన్నీరు మున్నీరుగా విలపించింది. అప్పటికే గ్రామ సంచారం ముగించుకుని అక్కడకు చేరుకున్న గ్రామదేవత పోలేరమ్మ, ఆమెను చూసి ఎందుకు ఏడుస్తున్నావని ప్రశ్నించింది. ఏడో కోడలు గత ఎనిమిదేళ్లుగా తన జీవితంలో జరిగిన సంఘటనలను, తనపై పడిన నిందలను, తన హృదయంలో పేరుకుపోయిన బాధను అమ్మవారికి వివరించింది.

ఆమె భక్తికి, ఆవేదనకు కరుణించిన పోలేరమ్మ ఆమెకు అక్షతలు ఇచ్చి, గతంలో మరణించిన తన పిల్లల వద్ద ఆ అక్షతలను చల్లి, వారిని పేరుపేరునా పిలవమని చెప్పిందని కథనం. ఆమె అమ్మవారి ఆదేశం మేరకు భక్తితో ఆచరించగా, తన పిల్లలందరూ తిరిగి లభించారని లోకోక్తి చెబుతోంది.

ఆనందంతో ఆమె పిల్లలందరినీ వెంటబెట్టుకుని అమ్మవారి సన్నిధికి చేరి కృతజ్ఞతలు తెలిపి, ఆశీస్సులు పొంది ఇంటికి చేరుకుంది. మరుసటి రోజు జరిగిన విషయాన్ని గ్రామస్థులకు వివరించింది. అందరూ ఆనందించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది పోలాల అమావాస్య వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడం ప్రారంభమైందని ప్రజల విశ్వాసం.

పూజా విధానం

పోలాల అమావాస్య రోజున కంద మొక్కను పూజా గదిలో ఉంచి, దానికి తొమ్మిది పసుపు కొమ్ములు కట్టడం సంప్రదాయంగా వస్తోంది. ముందుగా విఘ్నేశ్వరుడిని ఆరాధించి, అనంతరం కంద మొక్కలో మంగళగౌరీ దేవిని లేదా సంతానలక్ష్మీ దేవిని ఆహ్వానించి షోడశోపచార పద్ధతిలో పూజ నిర్వహిస్తారు.

ఐదు రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించడం ఆచారంగా ఉంది. పూజ అనంతరం పోలాల అమావాస్య వ్రతకథను భక్తిశ్రద్ధలతో వింటారు. అనంతరం తమ శక్తి మేరకు ముత్తైదువులకు భోజనం, తాంబూలాలు అందజేస్తారు.

పోలాల అమావాస్య కేవలం ఒక వ్రతం లేదా పూజా కార్యక్రమం మాత్రమే కాదు. మన జీవితానికి తోడ్పడే ప్రతి జీవి పట్ల కృతజ్ఞత చూపాలనే గొప్ప సందేశాన్ని అందించే పర్వదినం. ప్రకృతితో మానవుడికి ఉన్న విడదీయరాని సంబంధాన్ని ఈ పండుగ గుర్తుచేస్తుంది. . కృతజ్ఞత, కరుణ, భక్తి అనే మూడు విలువలను ఒకే వేదికపై నిలబెట్టే అపూర్వమైన పండుగే పోలాల అమావాస్య అని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు

అప్రకటిత కరెంటు కోతలను నిరసిస్తూ రైతులు, యువత పెద్ద ఎత్తున ఆందోళన

రాయికల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి-జగిత్యాల నిర్మల్ ప్రధాన రహదారిపై రాయికల్లో రైతుల రాస్తారోకో







రాయికల్ మండలం సెప్టెంబర్,10(పబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న అప్రకటిత కరెంటు కోతలను నిరసిస్తూ స్థానిక రైతులు, యువత పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగం, రాయికల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ప్రధానాంశాలు పార్టీలకతీతంగా ఏకమైన రైతులు రాజకీయాలకు, పార్టీ జెండాలకు అతీతంగా మండలంలోని వివిధ గ్రామాల రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన విద్యుత్ కోతల వల్ల మోటార్లు నడవక పొలాలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని, తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల సానుకూల హామీ: రైతుల సమస్యలపై స్థానిక విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సమస్య తీవ్రతను జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా సమగ్ర నివేదిక పంపుతామని లిఖితపూర్వకంగా/మౌఖికంగా హామీ ఇచ్చారు.

ఆందోళన విరమణ: అధికారుల హామీతో రైతులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. సమస్య త్వరగా పరిష్కారం కాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పట్టణ కోఆర్డినేటర్ తురగా శ్రీధర్ రెడ్డి, గోపి రాజిరెడ్డి, గడ్డం గంగారెడ్డి,బత్తిని భూమయ్య, కోయ్యేడి మహిపాల్ రెడ్డి,భూష గంగ మల్లయ్య, నాగిరెడ్డి తిరుపతి, అనుమల్ల సత్యనారాయణ, కుమ్మరిపల్లి మాజీ సర్పంచ్ ఉడత నందయ్య, కుమ్మరిపల్లి సర్పంచ్ గుమ్మడిసంతోష్ లు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

మల్లాపూర్ సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)



భూమి కోసం, భుక్తి కోసం దొరల గడీల అహంకారాన్ని ఎదిరించి, నిరుపేదల హక్కుల కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో ఆమెకు రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డు చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రజక సంఘం అధ్యక్షుడు వేములవాడ దేవరాజం మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ విముక్తి కోసం, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె చూపిన పోరాట బాట, ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని, ఆమె స్ఫూర్తితో హక్కుల సాధనకై ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, కార్యదర్శి వినీత, కారోబార్ సుధాకర్, పాలకవర్గ సభ్యులు కలసాని రాజన్న, బాస రాజిరెడ్డి, కత్తి నరేష్, మహమ్మద్ బషీర్, రజక సంఘం అధ్యక్షులు వేములవాడ దేవరాజం, ఉపాధ్యక్షుడు వేములవాడ శేఖర్, నాయకులు సురకంటి తిరుపతి రెడ్డి, చిలివేరి రాములు, మరియు రజక సంఘం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన

ఓర్వకల్లు, సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్):

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (DCPU), 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్తంగా ఓర్వకల్లు మండలంలోని ప్రభుత్వ ఆర్‌సీ రెడ్డి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నివారణ, బాలబాలికల భద్రత, విద్యను ప్రోత్సహించడం, గ్రామస్థాయి నిర్ణయాల్లో భాగస్వామ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల బాలబాలికలు ఎదుర్కొనే సామాజిక, విద్యా, ఆరోగ్యపరమైన సమస్యలను వివరించి, వాటి నుంచి బయటపడేందుకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలు, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవల గురించి తెలియజేశారు.అలాగే విద్యార్థులకు జీవన నైపుణ్యాల ప్రాధాన్యతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. తమను తాము తెలుసుకోవడం ద్వారా ఆరోగ్యంగా,





సురక్షితంగా ఉండటం, ఇతరులతో మంచిగా మెలగడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, సమాజంలో మరియు గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సులభంగా పరిష్కరించుకోవడం వంటి అంశాలను వివరించారు. విద్య ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు కీలకమని, బాలబాలికలు తమ చదువును కొనసాగిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది బి. పద్మ, కే. విమల (సూపర్‌వైజర్), ఆర్. సునీత (కేస్ వర్కర్)తో పాటు కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం



మల్లాపూర్ సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన శంభు తిరుపతి దంపతుల కుమారుడు త్రినయ్ ఇటీవల జరిగిన ఎంబీబీఎస్ మొదటి రౌండ్ కౌన్సిలింగ్ ఫలితాల్లో స్టేట్ మెరిట్ ర్యాంక్ సాధించిన సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు సంగ గంగరాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా గంగారాజం మాట్లాడుతూ వైద్యుడిగా ఎదగాలనే లక్ష్యంతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ క్రమశిక్షణతో కష్టపడి చదివి మంచి ర్యాంకు సాధించడం ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శమని, భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరకంటి గంగ మల్లయ్య, వేల్పుల రాజం, జాల మల్లేష్, ఎగుర్ల సోమయ్య, తొట్ల మల్లయ్య, బింగి మల్లేష్, మధు, సంపత్, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

శ్రీకృష్ణదేవరాయలు @నంద్యాల



- శ్రీకృష్ణదేవ రాయల విగ్రహ ఏర్పాటుకు చర్యలు
- ఈనెల 13న నంద్యాలలో విగ్రహ ఆవిష్కరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న నంద్యాల ప్రాంత ప్రజలు

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 9 ,(రిపబ్లిక్ న్యూస్):-



నంద్యాల ప్రాంతానికి మరియు విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలకు అత్యంత పవిత్రమైన చారిత్రక, సాహిత్యపరమైన బలమైన సంబంధం ఉంది. విజయనగర సామ్రాజ్య వైభవంలో నంద్యాల ప్రాంతం ఒక ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా వర్ధిల్లిందనేది శాసనాల ద్వారా తెలుస్తోంది.

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు కలలు సాహిత్యం మరియు హిందూ ధర్మ రక్షణకు ఎనలేని సేవ చేశారు. ఆయన తన పరిపాలన కాలంలో రాయలసీమ వ్యాప్తంగా ముఖ్యంగా ప్రస్తుత నంద్యాల జిల్లా పరిధిలో అనేక చారిత్రాత్మక దేవాలయాలను నిర్మించారు.. పునరుద్ధరించారు. గోపురాలను ప్రతిష్టించారు. ఇందులో మహానందితో పాటు నవనందుల ఆలయాలు. నంద్యాల అనగానే మొదటగా గుర్తుకు వచ్చే మహానంది క్షేత్రం. పురాణాల ప్రకారం నంద్యాల చుట్టుపక్కల వెలసిన 9 నవనంది ఆలయాలను శ్రీకృష్ణదేవరాయలు అభివృద్ధి చేసి ఆలయ సముదాయాలను నిర్మించారని చారిత్రాత్మక ఆధారాలు కథనాలు చెబుతున్నాయి. నవనందుల్లో ప్రధానమైన మహానంది ఆలయం, ప్రథమ నంది, బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న శివ నంది, వినాయక నంది, సోమనంది, గరుడ నంది ,సూర్య నంది, కృష్ణ నంది ,నాగ నంది వీటన్నింటిని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారనీ చారిత్రక ఆధారాలు. వీటితోపాటు వీటితోపాటు మహానందీశ్వర ఆలయ ప్రాకారం అందమైన ముఖ మండపాలు మరియు గాలి గోపురాల నిర్మాణంలో విజయనగర శిల్పకళ శైలి స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే అవుకు పరిసర ప్రాంతాలలో ఉన్న చెన్నకేశవస్వామి దేవాలయం విజయనగర సామ్రాజ్యంతో గట్టి సంబంధం ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయల అనుమతి మరియు ప్రోత్సాహంతో ఆకాలపు జమీందారు నంద్యాల కృష్ణమరాజు 16వ శతాబ్దంలో ఈ ఆలయ నిర్మాణాన్ని గావించారనేది ఆనాటి శిలా శాసనాల ద్వారా తెలుస్తోంది. యాగంటి ఉమామహేశ్వరాలయం ప్రముఖ క్షేత్రం. ఈ ఆలయం ముఖద్వారం వద్ద ఉన్న ఎత్తైన మరియు సుందరమైన గాలిగోపరాన్ని విజయనగర రాజుల కాలంలో ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయల హయాంలో నిర్మించినట్లు చరిత్రకారులు పేర్కొంటారు. ఇక్కడి శిల్పాకల ఛాతూర్యం విజయనగర వైభవానికి అద్దం పడుతుంది.అంతే కాకుండా మత సామరస్యానికి ప్రతీకగా వ్యాపార నిమిత్తం వచ్చిన అరబ్బుల కోసం నమాజు చేసుకోవడానికి ప్రత్యేకంగా మసీదు ప్రాంగణాలను నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

నంద్యాల పేరు వెనుక రాయల ముద్ర

నవనందుల నిర్మాణం నంద్యాల అనే పేరు రావడానికి శ్రీకృష్ణదేవరాయలు కాలమే ప్రధాన కారణమని స్థానిక చరిత్ర చెబుతోంది. ఆయన పరిపాలనా కాలంలో ఈ ప్రాంతం 9 పవిత్ర నంది ఆలయాలు నవనందులు నిర్మించారు లేదా పునరుద్ధరించారనే సమాచారం. నంది ఆలయం అనే పదం నుంచి కాలక్రమమైన నంద్యాల అనే పేరు రూపాంతరం చెందిందని నానుడి. నవనందులు నంద్యాల ప్రాంతంలో ఉండడం విశేషం.



అహోబిలం శ్రీనరసింహస్వామి వారి దర్శనం

అహోబిలం నరసింహస్వామి క్షేత్రం దిగువ అహోబిలం మరియు ఆలయాలకు శ్రీకృష్ణదేవరాయలు భారీగా విరాళాలు ఇచ్చారనీ భక్తులు మాట్లాడుతూ ఉంటారు. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా అహోబిలం స్వామిని దర్శించుకొని యుద్ధాలలో విజయం సాధించినందుకు కృతజ్ఞతగా ఇక్కడ జేయస్తంభాన్ని, ఆలయ మండపాలను గోపురాలను నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయం ప్రస్తుత నంద్యాల జిల్లా సరిహద్దులోని నల్లమల్ల అడవుల్లో ఉన్న శ్రీశైల క్షేత్రానికి శ్రీకృష్ణదేవరాయలు గొప్ప సేవలు చేశారు. ఆలయ ఉత్తర ద్వారం వద్ద ఉన్న భవ్యమైన రాజగోపురాన్ని ఆయనే నిర్మించారు.అలాగే శివాజీ స్ఫూర్తి కేంద్రం పరిచయాల్లో రాయల కాలపు కట్టడాలు ఆనవాళ్లు ఉన్నాయి.



నంద్యాలలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు చర్యలు

ఎన్నో దశాబ్దాలుగా శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహాన్నినంద్యాల పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేయాలన్న కోరికను నెరవేర్చడానికి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.. చారిత్రక నగరమైన నంద్యాలలో విజయనగర చక్రవర్తి, సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవ రాయల వైభవాన్ని చాటిచెప్పేలా ఈ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. ఈనెల 13న నంద్యాలలోని ప్రధాన కూడలిలో విగ్రహ ఏర్పాటు కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ఈచర్యలతో నంద్యాల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహ ఏర్పాటుకు అధికార యంత్రాంగం,కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే విగ్రహ ఏర్పాటు తర్వాత పట్టణంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా, ప్రజలందరికీ సులభంగా కనిపించే శ్రీనివాససెంటర్ సమీపంలో ఎన్టీఆర్ కాంప్లెక్స్ లో ప్రముఖ కూడలిని (జంక్షన్) ఈ విగ్రహం కోసం స్థల పరిశీలన చేసి సుందరీకరణ పనులు ప్రారంభించారు. పనులను వేగవంతం చేయడానికి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడానికి స్థానిక కూటమి నాయకులు, రాయల అభిమానులు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులతో కూడిన కమిటీలను సమన్వయం చేస్తున్నారు. సాహిత్యానికి, సంస్కృతికి, పరిపాలనకు మారుపేరైన శ్రీకృష్ణదేవ రాయల విగ్రహాన్ని నంద్యాలలో ప్రతిష్టించడం ద్వారా భావితరాలకు ఆయన గొప్పతనాన్ని వివరించవచ్చని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అయితే వీటికి సంబంధించి ఇప్పటికే పట్టణంలో విగ్రహ ఏర్పాటుపై విస్తృత ప్రచారం కల్పించాలని కూటమి ప్రభుత్వం భావించింది. దీంతో నంద్యాల ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల కల నెరవేరుతున్నది

కూటమి ప్రభుత్వం చొరవతోనే సాధ్యం అయ్యింది

- బలిజ సంఘం నాయకులు కామిని మల్లి, శ్రీను



నంద్యాల పట్టణంలో శ్రీకృష్ణదేవ రాయల విగ్రహం ఏర్పాటు చేయాలని ఎన్నో దశాబ్దాలుగా బలిజ సంఘం నాయకులు ఎన్నో ప్రభుత్వాలకు కోరిన నెరవేర్చలేదు. కానీ కూటమి ప్రభుత్వంలో మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ ఎంతో చొరవ తీసుకొని ఈ విగ్రహం ఏర్పాటు చేయడంలో కృషి చేశారు మంత్రి ఫరూఖ్ కు మా ప్రత్యేక ధన్యవాదాలు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com